ప్రజాశక్తి

శనివారం 18 అక్టోబర్ 2025 5 విజయనగరం

యువజన ఉత్సవ పోటీలకు ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాస్థాయి యువజన ఉత్సవ పోటీలకు ఆహ్వానం పలుకుతున్నట్లు డిప్యూటీ కలెక్టర్, సెట్విజ్ సిఇఒ డి.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23న ఉదయం 10 గంటల నుంచి విద్యార్థులకు జిల్లాస్థాయి యువ దినోత్సవం పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో జానపద నృత్య బృందం జానపద నృత్య గీతాలపై యువతీ యువకులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 15ఏళ్ల నుంచి 29ఏళ్ల లోపు యువతీ యువకులు పాల్గొనవచ్చని తెలిపారు. విజేతలైన వారిని రాష్ట్రస్థాయికి రాష్ట్ర స్థాయికి, అక్కడ విజేతలకు జాతీయస్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. పాల్గొనదలచిన వారు నేరుగా నిర్వహణ వేదికైనా మహారాజా ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో అర్హత పత్రాలతో హాజరు కావాలని తెలిపారు.

సంక్షేమ హాస్టళ్లు మెరుగుపడాలి

వార్డెన్లు మరింత బాధ్యతాయుతంగా పనిచేయండి : కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలను మెరుగు పర్చాలని, అన్నిరకాల వసతులను కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి కోరారు. సంక్షేమాధికారులు మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు. పరిశుభ్ర వాతావరణం, సురక్షిత తాగునీరు, మెనూ ప్రకారం రుచికరమైన ఆహార పదార్థాలు, కనీస వసతులతోపాటు వారి భవిష్యత్తును తీర్చిదిద్దేవిధంగా విద్యను అందించాలని సూచించారు. ప్రతీఒక్కరూ శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. బిసి, సాంఘిక సంక్షేమ వసతిగృహాలు, సాంఘిక సంక్షేమ గురుకులాలు, గిరిజన, వికలాంగుల సంక్షేమం, స్త్రీశిశు సంక్షేమం, కస్తూరిబా గాంధీ విద్యాలయాలు తదితర శాఖల ఉన్నతాధికారులు, వసతిగృహాల సంక్షేమాధికారులతో కలెక్టరేట్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. వసతిగృహాల సంఖ్య, విద్యార్థులు, హాస్టళ్ల పరిస్థితులు, సమస్యలు, కావాల్సిన వసతులపై శాఖలవారీగా సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హాస్టళ్లలో శుభ్రత, పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. హాస్టల్ విద్యార్థులకు

అధికారులు, వసతిగృహ సంక్షేమాధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఎటువంటి ఆరోగ్యపరమైన ఇబ్బందులు తలెత్తినా ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వారికి ఆరోగ్య తనిఖీలను ఎప్పటికప్పుడు నిర్వహించాలని చెప్పారు. హాస్టళ్లలో వసతులను మెరుగపర్చాలని, నిధులకోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడంతోపాటు, స్థానికంగా దాతలు, బ్యాంకులు, ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల సహకారంతో ఆర్ఒ ప్లాంట్లు, ఫ్యాన్లు, ఇతర చిన్నచిన్న వసతులను సమకూర్చాలని సూచించారు. మరుగుదొడ్లు లేనిచోట్ల స్వచ్ఛభారత్ మిషన్ కి ప్రతిపాదనలు పంపించాలన్నారు. ఉత్తీర్ణతా శాతం పెంచాలని ఆదేశించారు. శిశుగృహ, బాల సదన్‌లు, చిన్నపిల్లల హాస్టళ్లపై మరింత శ్రద్ధ చూపించాలన్నారు. అనాథ పిల్లల పట్ల ఆప్యాయత, అనురాగం ప్రదర్శించాలన్నారు. సంక్షేమ వసతిగృహాలు, చిల్డ్రన్ హోమ్స్, అంగన్‌వాడీ కేంద్రాలను త్వరలో జిల్లా వ్యాప్తంగా తనిఖీ చేస్తామని కలెక్టర్ ప్రకటించారు. సమావేశంలో బాలల సంరక్షణ కమిటీ జిల్లా ఛైర్‌పర్సన్ హిమబిందు, డిఆర్ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, సాంఘిక సంక్షేమశాఖ డిడి వెంకటేశ్వరరావు, డిబిసిడబ్ల్యుఒ జ్యోతిశ్రీ, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఎడి ఆశయ్య, ఐసిడిఎస్ పీడీ టి.విమల, డిఇఒ మాణిక్యంనాయుడు, సమగ్రశిక్ష పిఒ డాక్టర్ రామారావు, గిరిజన సంక్షేమాధికారి శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కోళ్ల ఫారం యజమానితో మాట్లాడుతున్న సిపిఎం బృందం ; కోళ్ల ఫారంలో పరిశీలిస్తున్న పశుసంవర్ధక, వైద్య శాఖల అధికారులు

కోళ్లఫారం ఎత్తేయాల్సిందే

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.లక్ష్మి ● జాహ్నవి పౌల్ట్రీ ప్రభావిత గ్రామాల్లో పర్యటన

ప్రజాశక్తి - గజపతినగరం

ప్రజల ఆరోగ్యానికి, పంట పొలాలకు నష్టం కలిగిన కోళ్లఫారాన్ని ఎత్తేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.లక్ష్మి డిమాండ్ చేశారు. పాతబగ్గాం వద్ద ఉన్న జాహ్నవి పౌల్ట్రీ వల్ల దుర్వాసనతో పాతబగ్గాం, భూదేవిపేట, బంగారంపేట గ్రామస్తుల ఇబ్బందులపై శుక్రవారం 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన 'దుర్వాసన.. పంటలు నాశనం' కథనానికి స్పందించి సిపిఎం బృందం.. ప్రభావిత గ్రామాల్లో పర్యటించింది. ఆయా గ్రామస్తులతో మాట్లాడుతూ సమస్యలపై ఆరాతీశారు. దుర్వాసన వల్ల శ్వాసకోస వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేశారు. కోళ్ల వ్యర్థాలు పంట పొలాల్లో కలిసిపోయి, పంట వేయడానికి కూడా ఆస్కారం లేకుండా నష్టం కలుగుతోందని వాపోయారు. అనంతరం కోళ్లఫారం యజమాని సాయికృష్ణతో సిపిఎం నాయకులు మాట్లాడి, ప్రజారోగ్యాన్ని, ఇబ్బందులను గుర్తించి పౌల్ట్రీ ఫారం ఎత్తివేయాలని సూచించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు జి.శ్రీనివాస్, రైతుసంఘం నాయకులు దాసరి సింహాద్రి, భూదేవిపేట సర్పంచ్ కనకల సుబ్రమణ్యం, బంగారమ్మపేట గ్రామ పెద్దలు తెర్లాపు కృష్ణ, పాతబగ్గాం రైతులు చల్ల రామకృష్ణ, వెంకట్రావు, నక్క కామాక్షమ్మ, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

కోళ్లఫారాన్ని పరిశీలించిన అధికారులు

పాతబగ్గాంలో కోళ్లఫారంతో చుట్టుపక్కల గ్రామస్తులు, రైతులు పడుతున్న అవస్థలపై శుక్రవారం 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన 'దుర్వాసన.. పంటలు నాశనం' అనే కథనానికి అధికారులు స్పందించారు. పశుసంవర్ధక శాఖ అధికారి అవినాష్, వైద్యాధికారి సాయికృష్ణారెడ్డి.. కోళ్ల ఫారాన్ని పరిశీలించారు. ఫారం యజమానితో మాట్లాడి, బిల్డింగ్ ప్లానింగ్, అనుమతులకు సంబంధించి పత్రాలను చూపించాలని కోరారు. ఫారం నిర్వహణపై ఆరా తీశారు. స్థానికుల సమస్యలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆ శాఖల సిబ్బంది, జనసేన నాయకులు కడమల శ్రీను పాల్గొన్నారు.

ఆటో, క్యాబ్ డ్రైవర్లకు

వాహనమిత్ర రూ.25వేలకు పెంచాలి

- జిఒ 21ను, అచ్యుతాపురం ఫిట్నెస్ సెంటర్‌ను రద్దు చేయాలి
- సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరామమ్మ
- కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష

నిరసన దీక్షలో పాల్గొన్న సిఐటియు నాయకులు, ఆటో, క్యాబ్ డ్రైవర్లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉచిత బస్సు ప్రయాణం వలన నష్టపోతున్న ఆటో, క్యాబ్ డ్రైవర్లకు రూ.25వేలు ఇవ్వాలని, జీవో నెంబర్ 21, అచ్చుతాపురం ప్రవేట్ ఫిట్నెస్ సెంటర్ రద్దు చేయాలని, డ్రైవర్సు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సిఐ టియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరామమ్మ డిమాండ్ చేశారు. శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో ఆటో, క్యాబ్ డ్రైవర్లు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సుబ్బరావమ్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీశక్తి ఫ్రీ బస్సు పథకం వలన 60శాతం పైగా ఆటో, మ్యాజిక్ వ్యాన్ డ్రైవర్లు ఆదాయం కోల్పోయారని తెలిపారు. కావున వాహనమిత్ర సహాయం రూ.25వేలకు పెంచాలని, కార్మిక సంఘాల ఆందోళనలు, అభ్యర్థనలను పట్టించుకోకుండా డ్రైవర్స్‌కు కూటమి ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందన్నారు.

జిల్లాలో ఆటో, మ్యాక్సీ క్యాబ్, మోటర్ క్యాబ్ డ్రైవర్స్ 30 వేల మందికి పైగా ఉన్నారు. వీరిలో 15,978 మందికి మాత్రమే వాహన మిత్ర అమలు చేశారని తెలిపారు. లైసెన్స్ ఉండి అద్దె బండి వేస్తున్న డ్రైవర్‌లకు ఎవరికీ రాలేదని, వీరికి కూడా అమలు చేస్తామని ఎన్నికలో హామీ ఇచ్చారని, వెంటనే ఆ హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న ప్రతి డ్రైవర్‌కూ రూ.25వేలు ఇవ్వాలని ఆటో, టాటా మ్యాజిక్, ట్రాన్స్పోర్ట్ రంగంపై పెనాల్టీలు, ఈ చలానాలు పెంచుతూ ఇచ్చిన జీవో నెంబర్ 21రద్దు చేయాలని, అచ్యుతాపురం దగ్గర ఉన్న ప్రైవేట్ ఫిట్నెస్ సెంటర్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ట్రాన్సు పోర్టు కార్మికులందరికీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, గత ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం లబ్దిదారుల సంఖ్యను తగ్గించడం కోసం చాలా షరతులు పెట్టిందన్నారు. ఫిట్నెస్ సర్టిఫికెట్లను జారీ చేసేందుకు ఆటోమెటిక్ టెస్టింగ్ సెంటర్ పేరుతో ప్రైవేట్ సంస్థలకు అప్పుజెప్పడం వలన డ్రైవర్‌లను జలగల్లాగా పీక్కు తింటున్నా యన్నారు. వీటిని రద్దు చేసి ప్రభుత్వమే బాధ్యత పడి రెన్యువల్ చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. గ్రీన్ టాక్స్, టోల్ టాక్స్ రద్దు చేయాలి. ఓలార్, ఓబర్, రాపిడ్ వంటి యాప్స్ రద్దు చేయాలి. ప్రభుత్వమే ఒక యాప్ పెట్టాలని, పార్కింగ్ స్థలాలు కేటాయించాలని, పెట్రోల్, డీజిల్, స్పేర్ పార్ట్స్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. నిరసన దీక్షలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి టివి రమణ, జిల్లా కోశాధికారి ఎ.జగన్మోహన్, జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ, ఆటో యూనియన్ నాయకులు పైడిరాజు, శ్రీను, కూర్మారావు, సత్యనారాయణ, సతీష్, ఎర్నాయుడు, డ్రైవర్లు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల వినతి

కొత్తవలస : ఆటో డ్రైవర్లకు న్యాయం చేయాలని తహశీల్దార్ అప్పలరాజుకు సిఐటియు నాయకులు గాడి అప్పారావు ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు వాహనమిత్ర ద్వారా రూ.25 వేలు జమ చేయాలన్నారు. జిఒ 21ను రద్దు చేయాలని, పెట్రోల్, డీజిల్, గ్యాస్‌పై సబ్సిడీ ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ కార్మికులు, టాక్సీ కార్మికులు సిహెచ్ సత్యనారాయణ, బి.సూర్యనారాయణ, శ్రీనివాసరావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ చేసిన

విత్తనాలు, పురుగు మందులు సీజ్

అడ్వాంట కంపెనీ భాగోతం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండల కేంద్రంలోని కొవ్వాడ రోడ్డు లేఅవుట్లో అక్రమంగా మొక్కజొన్న విత్తనాలు, కలుపు నివారణ మందులు నిల్వలను శనివారం వ్యవసాయ అధికారులు గుర్తించారు. మండల వ్యవశాయశాఖ వీటిని శుక్రవారం వీటిని సీజ్ చేసింది. ప్రముఖ అడ్వాంట కంపెనీకి సంబంధించిన మొక్కజొన్న విత్తనాలుగా గుర్తించారు. ఇదే పరిశ్రమ గతేడాదికూడా ఇదే విధంగా ఆక్రమంగా నిల్వచేసి రైతులకు పంపిణీ చేసినట్లు ఉన్న సమాచారంతో ఈ ఏడాది వ్యవసాయశాఖ దీనిపై దృష్టి సారించింది. గతేడాది రైతులు సాగు చేసిన మొక్కజొన్నపై తమకు ఈ కంపెనీ నుండి పండించిన పంటకు గిట్టుబాటు రాలేదని, కొంతమంది రైతులకు బకాయిలు ఉన్నాయని నెల రోజుల క్రితం గందరగోళం జరిగింది. వ్యవసాయశాఖ దీనిపై ఇటీవల విచారణ నిర్వహించడంతో పరిశ్రమకు చెందిన మధ్యవర్తులు కొంత నగదు రైతులకు జమచేసినట్లు సమాచారం. అయితే ఈ ఏడాదికూడా ఇదే పరిస్థితి కొనసాగటంతో పాటు ఆక్రమంగా పురుగుమందులు నిల్వచేయటంతో మండల వ్యవసాయశాఖ అధికారిణి నీలిమ అక్క డకు చేరుకొని 2615కేజీల విత్తనాలు, 25 కేజీల కలుపు నివారణ కెమికల్ సీజ్ చేసారు. వీటి విలువ సుమారు రూ.9లక్షలుగా తెలిపారు. దీనిపై 6(ఎ) కేసును నమోదుచేస్తున్నట్లు తెలిపారు.

తనిఖీలు చేపడుతున్న అధికారులు

నకిలీ మద్యం లేదు

అబ్కారీ శాఖా డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస చౌదరి

ప్రజాశక్తి - కంటోన్మెంట్

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలో కల్తీ మద్యం ఎక్కడా లేదని అబ్కారీ శాఖ డిప్యూటీ కమిషనర్ వై. శ్రీనివాస చౌదరి తెలిపారు. శుక్రవారం విజయనగరంలోని తన ఛాంబర్ ఏర్పాటు చేసిన విలేకర్ల సమవేశంలో ఆయన మాట్లాడుతూ విజయనగరం జిల్లాలో గల 169 మద్యం షాప్‌లు, 20 బార్‌లు, పార్వతీపురం మన్యం జిల్లాలో 56 మద్యం షాప్‌లు, 6 బార్ లలో విస్తత తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ తనిఖీల్లో ఎక్కడా నకిలీ మద్యం దాఖలాలు కనిపించలేదన్నారు. రాష్ట్రంలో లైసెన్స్ పొందిన రిటైల్ మద్యం దుకాణాలు, బార్లు, ఇన్ హౌస్ సంస్థల కార్యకలాపాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన మద్యం మాత్రమే విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కొన్ని ప్రాంతాలలో నిర్ధారణకు లోనుకాని, అక్రమంగా తయారు చేయబడిన మద్యం ఉత్పత్తి, విక్రయాలు జరుగుతున్నట్లు వస్తున్న ఫిర్యాదుల మేరకు తనిఖీలు చేపట్టామన్నారు. ప్రజలకు నాణ్యమైన మద్యం అంధించేందుకు ఎపి ఎక్సైజ్ సురక్ష మొబైలు యాప్ వినియోగదారునికి, షాప్ లైసెన్సు దారుడికి వేర్వేరుగా ప్రవేశపెట్టినట్లు తెలిపారు. సమావేశంలో అబ్కారీ శాఖ సూపరింటెండెంట్ బి.శ్రీనాథుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస

పంచారామాలకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

రానున్న కార్తీక మాసంలో పంచారామాల సందర్శన క్షేత్రాలుగా పేరుగాంచిన అమరావతి, పాలకొల్లు, భీమవరం, ద్రాక్షారామం, సామర్లకోట పుణ్యక్షేత్రాలను సందర్శించేందుకు ప్రత్యేక బస్సు లను నడుపుతున్నట్లు ప్రజారవాణా అధికారిని జి.వరలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను కాంప్లెక్స్ ఆవరణలో ఆవిష్కరించారు. సూపర్‌లగ్జరీ, అల్ట్రాడీలక్స్, బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్తీక మాసంలో ప్రతి ఆదివారం అక్టోబర్ 26, నవంబర్ 2, 9,16 తేదీల్లో సాయంత్రం 4గంటలకు విజయనగరం డిపో నుండి బయలుదేరి మంగళవారం వేకువజామున తిరిగి విజయనగరం చేరుకునేలా బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సూపర్ లగ్జరీ రూ. 2000, అల్ట్రాడీలక్సు రూ.1950గా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టిక్కెట్లు కోసం www.apsrtconline.in లాగిన్ అయి ఆన్లైన్ ద్వారా లేదా మీదగ్గరలో ఉన్న డిపోకి వెళ్లి టిక్కెట్లను బుక్ చేసుకొనే సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ శ్రీనివాసరావు అసిస్టెంట్ మేనేజర్ సుమిత్ర పాల్గొన్నారు.

వికలాంగ ఉద్యోగిని చూసి చలించిపోయిన కలెక్టర్

సమస్యను తెలుసుకొని.. పరిష్కారానికి కృషి

కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న రూపశ్రీ తండ్రి

ప్రజాశక్తి- కంటోన్మెంట్

ప్రతి నెల మూడవ శుక్రవారం నిర్వహిస్తున్న ఎంప్లాయిస్ గ్రీవెన్సులో ఫిర్యాదులు ఇచ్చిన పలువురు సిబ్బంది కలెక్టర్ రాంసుందర్ రెడ్డి చొరవతో వారి సమస్యలు పరిష్కారం అవుతున్నందుకు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్ లో జరిగిన ఒక సంఘటన అక్కడి వారి హృదయాలను హత్తుకుంది. గ్రీవెన్స్ లో అర్జీ పెడదామని తన తండ్రి సహాయంతో మూడు చక్రాల కుర్చీలో వస్తున్న ఎస్ కోటకు చెందిన విభిన్న ప్రతిభావంతురాలు కలెక్టరేట్ లోపల ఎదురు చూస్తోంది. అటుగా వచ్చిన కలెక్టర్ ఆమెను చూస్తూనే పలకరించి ఏమ్మా దేనికోసం వచ్చారని అడిగారు. అంగవైకల్యంతో ఉన్న ఆ యువతి తన బాధను కలెక్టర్ రాంసుందర్ రెడ్డికి వివరించింది. తన సమస్య పట్ల మానవత్వంతో స్పందించిన కలెక్టర్ నీ సమస్యను ప్రభుత్వానికి పంపించి నీకు మేలు జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఎస్.కోట మండలానికి చెందిన తానవరపు రూపశ్రీ ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఎస్‌జిటి. (సెకండరీ గ్రేడ్ టీచర్)గా ఎంపికై కురుపాం మండలంలో పోస్టింగ్ వచ్చింది. పూర్తిగా వికలాంగురాలైన రూపశ్రీ దూరప్రాంతమైన కురుపాం మండలానికి వెళ్లడం శారీరక పరిస్థితుల దృష్ట్యా సాధ్యం కాదని తెలుసుకున్న కలెక్టర్... తన పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వానికి నివేదించి తగిన చర్యలు తీసుకునేలా చూస్తానని భరోసా ఇచ్చారు. కలెక్టర్ గారి ఆ సానుభూతి స్పందన రూపశ్రీ లో ఆత్మవిశ్వాసాన్ని నింపింది.

శుక్రవారం నిర్వహించిన ఎంప్లాయిస్ గ్రీవెన్స్ లో 27 ఫిర్యాదులు అందాయి. గత నెలలో అందిన 40 ఫిర్యాదులలో అత్యధిక శాతం సమస్యలు పరిష్కారం అయినందున ఆయా ఫిర్యాదుదారులు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ట్రెజరీ, డ్వామా, ఇపీడీసీఎల్, మెడికల్ విభాగాలకు చెందిన ఫిర్యాదులు వస్తున్నాయని, ఆయా విభాగాల అధిపతులు సత్వరమే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అవసరమైతే ఆయా శాఖల ప్రధాన అధికారులకు డిఒ లెటర్ రాస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. సంయుక్త కలెక్టర్ సేధు మాధవన్, డిఆర్ఒ ఎస్. శ్రీనివాసమూర్తి, జిల్లాలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

పత్రికా స్వేచ్ఛపై

అణచివేత చర్యలు మానుకోవాలి

సాక్షిపై అక్రమ కేసులను వ్యతిరేకిస్తూ జర్నలిస్టుల నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నకిలీ మద్యం తయారీపై వార్తలు రాస్తున్న సాక్షి మీడియాను అడ్డుకోవడానికి కూటమి ప్రభుత్వం పోలీసులు ద్వారా చేస్తున్న కుట్రలు మానుకోవాలని జర్నలిస్టులు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట నిరసనలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ ప్రజాపక్షంగా ఉన్న పత్రికల గొంతు నొక్కేయడం అంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని అన్నారు. వార్తలు సహేతుకంగా లేవని భావించినప్పుడు వివిధ వేదికల ద్వారా వాటిని ఖండించడం సర్వసాధారణమని, అటువంటి ప్రజాస్వామ్య పద్ధతులను పక్కన పెట్టి అక్రమ కేసులు పెట్టి వేదింపులకి దిగడం భావ ప్రకటనా స్వేచ్ఛను కాల రాయడమే అవుతుందని ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులను, పత్రికా స్వేచ్ఛను పరిరక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎస్ రామ్ సుందర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. జర్నలిస్టుల నిరసన కార్యక్రమానికి ఎపియూడబ్ల్యూజే జిల్లా కమిటీ మద్దతు తెలిపింది. సాక్షి బ్యూరో చీఫ్ గాంధీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎపియుడబ్ల్యుజె నాయకులు పివి శివప్రసాద్, మహాపాత్ర, పంచాది అప్పారావు, విఎంఎల్ లక్ష్మణరావు, వెంకట్, రాజేంద్ర, విజయలక్ష్మి, చిన్న, మధ్యతర పత్రికల ఎడిటర్స్ సంఘం అధ్యక్షుడు కెజెశర్మ, సముద్రాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : పత్రికా స్వేచ్ఛను కాపాడాలని ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా అధ్యక్షులు వ్యాస్ బాబు డిమాండ్ చేశారు. సాక్షి ఎడిటర్‌పై వేధింపులు ఆపాలని శుక్రవారం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. కల్తీ మద్యంపై వరుస కథనాలు రావడంతో ఎడిటర్‌పై పోలీసులు విచారణ పేరుతో వేధించడం అన్యాయమన్నారు. అనంతరం ఆర్‌డిఒ రామ్మోహనరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

చీపురుపల్లి : సాక్షి ఎడిటర్‌కు పోలీసులు నోటీసులు ఇవ్వడానికి వ్యతిరేకంగా చీపురుపల్లి నియోజకవర్గ పరిధిలోని జర్నలిస్టులు పట్టణంలో మూడు రోడ్ల కూడలిలో నిరసన చేపట్టారు. అనంతరం ఆర్‌డిఒకు వినతి అందించారు.

ప్రజాదర్బార్‌లో వినతుల స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం కోట

వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే అదితి

ప్రజాసమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి శుక్రవారం పార్టీ కార్యాలయం అశోక్‌బంగ్లాలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా 20 మంది తమ సమస్యలు పరిష్కరించాలని వినతులు స్వీకరించారు. చెల్లూరు గ్రామానికి చెందిన కోరాడ సన్యాసి గత ఏడాది నుంచి పింఛన్ కోసం తిరుగుతున్నానని, సదరం సర్టిఫికెట్ 75శాతం వికలాంగత్వం ఉన్నట్లు తెలిపాడు. తనకు పింఛను మంజూరు చేయాలని కోరాడు. స్థానిక 36వ డివిజన్లో కుళాయినీరు సరిగ్గా రావట్లేదని ఫిర్యాదు చేశారు. పావని నగర్ సిక్కుల గుడి దగ్గరలో రోడ్డు ఆక్రమణ చేసి దౌర్జన్యం చేస్తున్నట్లు తెలిపారు, గుండాలపేటలో పేదలకు ఇళ్ల కోసం వినతి అందజేశారు. చెల్లూరు గ్రామానికి చెందిన హైవే సెంట్రల్ లైటింగ్ కరెంట్‌బిల్లు విషయంలో గ్రామపంచాయతీ నుంచి వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పందిస్తూ ఈ సమస్యలన్నింటినీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షులు గంటా రవి, మండల పార్టీ అధ్యక్షులు గంటా పోలి నాయుడు, కార్యదర్శి పాశి అప్పలనాయుడు, చెల్లూరు గ్రామ ఎంపిటిసి శంకర్రావు, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

ప్రాథమిక స్థాయిలో గుర్తిస్తే కేన్సర్‌ను అధిగమించొచ్చు

ఎస్‌పి ఎఆర్ దామోదర్

ప్రజాశక్తి -కంటోన్మెంట్

కేన్సర్‌ను ప్రాథమిక స్థాయిలో గుర్తిస్తే అధిగమించవచ్చునని ఎస్‌పి ఎఆర్ దామోదర్ అన్నారు. బ్రెస్ట్ కేన్సర్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు మహేంద్ర ఆసుపత్రి, మహాత్మా గాంధీ కేన్సర్ ఆసుపత్రి సంయుక్తంగా నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఎస్‌పి దామోదర్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేన్సర్‌ను ప్రాథమిక స్థాయిలో గుర్తిస్తే, చికిత్సను అందించి, స్వస్థత పొందవచ్చునన్నారు. ఇందుకు ప్రజల్లో ముఖ్యంగా మహిళల్లో అవగాహన అవసరమన్నారు. కేన్సర్ రాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకొనేందుకు ప్రతీ ఒక్కరూ ప్రతీ రోజూ కొంత సమయాన్ని వ్యాయామానికి కేటాయించాలన్నారు. అనంతరం రోటరీ క్లబ్ గవర్నర్ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడారు.అనంతరం, బాలాజీ జంక్షను నుండి కోట జంక్షను వరకు నిర్వహించిన ర్యాలీని ఎస్‌పి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో మహేంద్ర ఆసుపత్రి వైద్యులు డాక్టర్ మహేంద్ర గిరి, కేన్సర్ స్పెషలిస్టు డాక్టర్ ఊన మురళీకృష్ణ, వన్ టౌన్ సిఐ ఆర్‌విఆర్‌కె చౌదరి, ట్రాఫిక్ సిఐ సూరినాయుడు పాల్గొన్నారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్‌పి ఎఆర్ దామోదర్

సాగు భూములను రైతులకు అప్పగించాలి

ప్రజాశక్తి-కొత్తవలస

స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి చిన్నిపాలెం రెవెన్యూ పరిధిలో ఇనాం భూములు సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న తమకు వాటిని అప్పగించాలని రైతులు.. తహశీల్దార్‌కు శుక్రవారం వినతి అందించారు. సాగుచేస్తున్న రైతులను కాదని, నాలుగు కార్పొరేట్ కంపెనీలకు భూముల్ని ధారాదత్తం చేయడం దారుణమని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో రెవెన్యూ అధికారులు చేసిన సర్వే రికార్డులు తప్పుగా నమోదు అయ్యాయని చెప్పారు. సాగులో ఉన్న రైతులు పేర్లు కాకుండా కార్పొరేట్ కంపెనీల పేర్లు నమోదు కావడంతో నష్టపోయామని వాపోయారు. జిల్లా అధికారులు సైతం రైతులకు న్యాయం చేస్తామని ఇచ్చిన హామీలు బుట్టదాఖలు అయ్యాయని చెప్పారు. వెంటనే రైతులకు న్యాయం చేయాలని చిన్నిపాలెం భూ పోరాట సమితి నాయకులు ముయ్యి దేముడు, చల్లా వెంకట్రావు తదితరులు కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జట్లు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక విజ్జీ స్టేడియంలో అండర్ 14 (సబ్ జూనియర్) 12వ రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఉమ్మడి విజయనగరం జిల్లా ఫెన్సింగ్ క్రీడాకారులకు సైబర్ ,ఇప్పి, ఫాయిల్ విభాగాల్లో శుక్రవారం ఎంపిక చేశారు. ఉమ్మడి విజయనగరం జిల్లా నుండి ఎంపికైన క్రీడాకారులు శనివారం కాకినాడలోని లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరుగు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు సుంకర సతీష్ కుమార్, పీడీ సౌదామిని, శిక్షకులు డివి చారి ఆధ్వర్యంలో ఎంపికలు జరిగాయి. కోచ్ అప్పలరాజు రిఫరీగా వ్యవహరించారు. పడగల కనిష్, ఎమ్‌డి షేక్ అహ్మద్, జె.శ్యాంశశాంక్, పి.శారద, ఎన్ఎం జితేంద్ర (ఫైల్), బి.హర్షవర్ధన్ (ఇప్పి), బి. ఆదిత్య వర్ధన్, బి.హన్సి శ్రీవల్లి (సేబర్) విభాగాల్లో ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా డిఎస్‌డిఒ శ్రీధర్, జిల్లా ఫెన్సింగ్ సంఘ సభ్యులు దాలిరాజు, పి.అనిల్ కుమార్, ఎం.బాలరాజు, వెంకటేష్ అభినందనలు తెలిపారు.

ఉత్సాహంగా మండల స్థాయి క్రీడా పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో అండర్ 14,17 విభాగంలో మండల స్థాయి క్రీడాపోటీలు శుక్రవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. అన్ని మండల కేంద్రాల్లో జరిగిన అథ్లెటిక్స్, కబడ్డీ,వాలీబాల్, ఖో ఖో పోటీల్లో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. విజయనగరం మండలం పోటీలు స్థానిక విజ్జి మైదానంలో జరిగాయి. రెండు రోజుల పాటు జరగనున్న పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు తర్వాత జరిగే జిల్లా స్థాయి పోటీలో పాల్గొంటారని స్కూల్ గేమ్స్ కార్యదర్శులు గోపాల్, విజయలక్ష్మి లు తెలిపారు. పోటీలకు వచ్చే క్రీడాకారులకు అన్ని వసతులు, భోజనం వంటి జాగ్రత్తలు తీసుకుంటామన్నారు.

పెంచిన పనిగంటల జిఒ రద్దు చేయాలని ధర్నా

ప్రజాశక్తి-నెల్లిమర్ల

పని విధానాన్ని 10 గంటలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జిఒను తక్షణమే రద్దు చెయ్యాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.రమణ, ఎపి బేవరేజెస్ ముఠా యూనియన్ అధ్యక్షులు రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎపి బేవరేజెస్ నెల్లిమర్ల డిపో వద్ద జరిగిన ధర్నాలో వారు మాట్లాడారు. పెరుగుతున్న నిత్యావసర ధరలతో కార్మికుల బతుకులు రోజురోజుకు రోడ్డున పడుతున్నాయని, కనీస వేతనాలు మాత్రం పెంచడం లేదని చెప్పారు. కార్యక్రమంలో డిపో మేస్త్రి గోవింద్, శ్రీను, సత్తిబాబు పాల్గొన్నారు.

మహిళే కుటుంబానికి పునాది : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఆరోగ్యవంతమైన మహిళ.. శక్తివంతమైన కుటుంబానికి బలమైన పునాదని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సిడిపిఒ అచ్యుతాంబ.. 100 రోజుల సంరక్షణ, పౌష్టికాహార ఆవశ్యకతను గర్భిణులకు, బాలింతలకు వివరించారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, ఎంపిడిఒ సతీష్, తహశీల్దార్ శ్రీనివాసరావు, ఐసిడిఎస్ పిఒ అచ్యుత, నాయకులు జుత్తాడ రామసత్యం, నానిగిరి రామనాజీ, మల్లేశ్వరరావ్, భీశెట్టి అరుణ, తదితరులు పాల్గొన్నారు.

విఆర్ఒ సేవలు సంతృప్తికరం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని కందివలస విఆర్ఒ రామునాయుడు సేవలు సంతృప్తికరంగా ఉన్నాయని కందివలస జనసేన నాయకులు నక్కాన రమణతో పాటు కనిమెట్ట నాయకులు కూనిశెట్టి గోవిందరావు, డోప్పా జోగులు కొంతమంది గ్రామస్తులు అన్నారు. శుక్రవారం తహశీల్దార్ ఎన్‌వి రమణను కలిసారు. విఆర్ఒపై కందివలస సర్పంచ్ గణేష్ గురువారం ఫిర్యాదు చేసిన నేపథ్యంలో వీరంతా తహసీల్దార్ ఎన్‌వి రమణను కలిశారు. తమ గ్రామాలకు విఆర్ఒగా రామునాయుడునే కొనసాగించాలని వినతిపత్రం అందజేశారు. గ్రామంలో రెవెన్యూ సమస్యలకు సకాలంలో పరిష్కారం చూపేలా చొరవ చూపే రామునాయుడునే విలేజ్ రెవెన్యూ అధికారిగా కొనసాగించాలని కోరారు. వ్యక్తిగత కక్షతోనే లేనిపోని ఆరోపణలు చేస్తూ సర్పంచ్ తప్పుడు ఫిర్యాదు చేశారని తెలిపారు. గ్రామంలో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించి , రైతులు ,ప్రజాభిప్రాయం మేరకు మీరు చర్యలను కొనసాగించవచ్చునని తహశీల్దార్ రమణను కోరారు.

సింగుబాబుకు నివాళి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

రక్తదాతలను అభినందిస్తున్న ఎమ్మెల్యే మాధవి

కొండవెలగాడలో మాజీ జెడ్‌పిటిసి, కీర్తిశేషులు దంతులూరు శంకర సీతారామ రాజు (సింగుబాబు) జయంతిని ఆయన కుమారుడు అజయ్‌బాబు ఆధ్వర్యాన శుక్రవారం నిర్వహించారు. సింగుబాబు చిత్రపటానికి ఎమ్మెల్యే లోకం మాధవి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురేష్ బాబు, టిడిపి నాయకులు సువ్వాడ రవిశేఖర్, గేదెల రాజారావు, కంది చంద్రశేఖరరావు, పతివాడ అప్పలనారాయణ, మహంతి చిన్నమనాయుడు, పతివాడ తమ్మినాయుడు, గేదెల రాజారావు, పల్లె భాస్కరరావు, ప్రదీప్ రాజు, జనసేన పార్టీ నాయకులు చనమల్లు వెంకటరమణ, జనా ప్రసాద్, గదల అచ్చం నాయుడు, కరుమజ్జి గోవిందరావు, అంబల్ల అప్పలనాయుడు, పతివాడ గోవిందరావు పాల్గొన్నారు.

పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో
ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

పట్టణ పౌర సంక్షేమ సంఘం, అయ్యప్ప నగర్ పోరాట కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అయ్యప్ప నగర లో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు, అయ్యప్ప నగర్ పోరాట కమిటీ నాయకులు యు ఎస్ రవికుమార్ లు మాట్లాడుతూ వైద్యం ఖరీదైన నేడు ప్రజలకు ఉచితంగా వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో మెడికల్ క్యాంపు పెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సుధీర్, రెడ్డి, అప్పారావు, శేషగిరి మాస్టర్, రామకృష్ణ మాస్టర్, పట్టణ పౌర సంఘం నాయకులు బి.రమణ, ఎంఆర్ఐ ఆస్పత్రి వైద్య సిబ్బంది మోహన్ రావు సహకారంతో 70మందికి బిపి, సుగర్ పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు.

అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలోని అక్రమ నిర్మాణాలు, లేఅవుట్లపై దృష్టి పెట్టాలని మున్సిపల్ కమిషనర్ ఎల్. రామలక్ష్మి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం సచివాలయ అడ్మిన్లు, టౌన్ ప్లానింగ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ఎల్ఆర్ఎస్‌పై పట్టణంలో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. అక్రమ లేఅవుట్లు క్రమబద్ధీకరణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. ఎల్ఆర్ఎస్ కింద క్రమబద్ధీకరణ చేసుకుంటే 7 శాతం మాత్రమే ఫీజు చెల్లించాలన్నారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేస్తే గుర్తించి నోటీసులు ఇవ్వాలని చెప్పారు.

ఆ వాహనాల సమాచారం ఇవ్వండి

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రమాదాలకు గురైన వాహనాలు బాగు చేసేందుకు మెకానిక్ షాపులకు వస్తే సమాచారం ఇవ్వాలని పట్టణ సిఐ కె.సతీష్‌కుమార్ కోరారు. పట్టణ పోలీస్ స్టేషన్లో శుక్రవారం మోటార్ మెకానిక్‌లతో సమావేశం నిర్వహించారు. ప్రమాదాలకు గురైన వాహనాలు, చోరీ వాహనాలు బాగు చేసేందుకు మెకానిక్ షాపులకు వస్తే పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. నెంబర్ ప్లేట్ లేని, సైలెన్సర్ లేని వాహనాలు సమాచారం ఇవ్వాలన్నారు. షాపుల వద్ద ట్రాఫిక్ జామ్ లేకుండా చూడాలన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు మండవకురిటి విద్యార్థులు

ప్రజాశక్తి- సంతకవిటి

మండవకురిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు అర్హత సాధించారు. శ్రీకాకుళంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో మింద్రనా నోసియా, పోతురాజు మేఘన, అలవాన సాయి భార్గవి, పాలిసెట్టి నాని, బొద్దూరు ధనలక్ష్మి ఎంపిక కావడంతో హెచ్ఎం ఎం.రమణమ్మ, ఎస్ఎంసి ఛైర్మన్ మాధవరావు, సర్పంచ్ జ్యోతీశ్వరరావు, కైలాస్‌రావు, సమతం శ్రీను, సాంబశివరావు అభినందించారు.

ఎస్‌సి రిజర్వేషన్‌ను 25 శాతానికి పెంచాలని ధర్నా

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఎస్‌సి రిజర్వేషన్‌ను 25 శాతానికి పెంచాలని శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ జంక్షన్ వద్ద అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం ప్రతినిధి ఉదయ భాస్కర్ ఆధ్వర్యాన ధర్నా చేశారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తహశీల్దార్ శ్రీనివాసరావుకు వినతి అందించారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు ఎస్ఆర్ వేమన, ఆదాడ మోహన్ రావు, కెల్ల భీమారావు, గొల్ల ఈశ్వరరావు, గంటాన అప్పారావు, పెద్ద సూరిదేముడు, ఎద్దు బాలకృష్ణ పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రయివేటీకరణతో
పేద విద్యార్థులకు నష్టం
మాజీ ఎమ్మెల్యే కడుబండి

కొత్తవలస.. సంతకాలు సేకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- కొత్తవలస

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణతో పేద విద్యార్థులకు తీవ్ర నష్టమని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. కాటకాపల్లి, చినరావుపల్లి గ్రామాల్లో సంతకాల సేకరణ చేపట్టారు. పేదలకు ఉచిత వైద్యం అందించాలనే లక్ష్యంతో వైఎస్ జగన్ ప్రారంభించిన ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరించే ప్రయత్నాలను వ్యతిరేకిస్తున్నామని కడుబండి అన్నారు. ప్రజల ఆరోగ్యం, ప్రభుత్వ వైద్య విద్యను కాపాడే ఈ పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి నెక్కల నాయుడుబాబు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గొరపల్లి శివ, నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు మమ్ములూరి వెంకటలక్ష్మి, నెక్కల శ్రీదేవి, మండలపార్టీ అధ్యక్షులు ఒబ్బిన నాయుడు, యడ్ల కిషోర్, నియోజకవర్గం పంచాయితీ రాజ్ అధ్యక్షులు కూనిరెడ్డి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లి : ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా మండలంలోని అలజంగి, పత్తికాయవలస పంచాయతీల్లో శుక్రవారం వైసిపి ఆధ్వర్యాన సంతకాలు సేకరించారు. వైసిపి జిల్లా నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మండల అధ్యక్షులు మీసాల వరహాలనాయుడు, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షులు బెల్లాన వంశీ.. ఇంటింటికీ వెళ్లి మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ వల్ల నష్టాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి రైతు విభాగం రాష్ట్ర సహాయకార్యదర్శి దన్నాన జనార్దన, సర్పంచ్ రఘుమండ త్రినాథ, రేవల్ల సత్తిబాబు, గవిడి సురేష్, రవి శంకర్, రాము, పనస వినాయక్, వెంకి, రాంకీ, తదితరులు పాల్గొన్నారు.

నేడు వేపాడలో సంతకాల సేకరణ

వేపాడ : ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వేపాడ, వల్లంపూడి పంచాయతీల్లో శనివారం సంతకాలు సేకరించనున్నట్లు వైసిపి మండల అధ్యక్షులు జగ్గుబాబు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సురక్ష యాప్‌ను వినియోగించుకోవాలి
ఎక్సైజ్ సిఐ చక్రవర్తి

ప్రజాశక్తి-చీపురుపల్లి

సురక్ష యాప్‌ను మద్యం వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని చీపురుపల్లి ఎక్సైజ్ సిఐ చక్రవర్తి కోరారు. శుక్రవారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో మద్యం షాపుల నిర్వాహకులు, ఎక్సైజ్ సిబ్బందికి సురక్ష యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. మద్యం బాటిల్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేస్తే.. మద్యం ఎక్కడ తయారైంది? ఎక్కడ నుంచి వస్తుంది? మద్యం బాటిల్ ధరతో పాటు ఆ మద్యం మంచిదా? కాదా? తెలుసుకోవచ్చని తెలిపారు. ప్రతిరోజూ మద్యం విక్రయాలపై నిఘాను పెంచామని, ఎక్కడైనా అక్రమ మద్యం దొరికితే చర్యలు తప్పవని హెచ్చరించారు. చీపురుపల్లి సర్కిల్ పరిధిలోని చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం మండలాల్లోని 19 మద్యం షాపుల్లో నిరంతర తనిఖీలు చేస్తున్నట్లు వివరించారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-గుర్ల

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి ప్రమీల అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. ముందుగా వ్యవసాయ శాఖ ప్రగతి నివేదికను ఇన్‌ఛార్జి ఎఒ నాగరాజు వివరించారు. గొలగతాం, కొండగండ్రేడు సర్పంచులు, ఎంపిటిసి బుర్ల జోగినాయుడు యూరియా కొరతపై అధికారులను నిలదీశారు. సకాలంలో రైతులకు యూరియా అందించలేదన్నారు. దీంతో రైతులు అధిక ధరలు చెల్లించి బయట మండలాల్లో యూరియా కొనే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ విషయంపై ఇన్‌ఛార్జి ఎఒ నాగరాజు సమాధానం ఇస్తూ సకాలంలో యూరియా అందకపోవడంతో కొంత వరకు ఇబ్బంది ఏర్పడిందని చెప్పారు. అనంతరం ఐసిడిఎస్, నీటిపారుదల, విద్య, పంచాయతీరాజ్ శాఖలపై సమీక్ష నిర్వహించారు. విద్యుత్ బిల్లు వసూలు చేయడానికి గ్రామాల్లోకి బిల్లు కలెక్టరు రావడం లేదని, వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారని కొండగండ్రేడు సర్పంచ్ సారిక గోవింద్ అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. స్థానిక సచివాలయంలో ఆన్‌లైన్‌లో బిల్లులు చెల్లించవచ్చని ఎఇ తెలిపారు. బోర్లిపేట, కొండగండ్రేడు అంగన్వాడీ కేంద్రాలకు విద్యుత్తు సరఫరా లేక చిన్నారులు ఇబ్బంది పడుతున్నారని సర్పంచ్ తెలిపారు. కొండగండ్రేడు దళిత కాలనీలో విద్యుత్ వైర్లు చేతికి అందినంత ఎత్తులో ఉన్నాయని, వాటి వల్ల ఏ క్షణాన ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నట్లు సర్పంచ్ గోవింద్ తెలిపారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ఎంపిపిలు తోట తిరుపతిరావు, అంబళ్ల లక్ష్మి, పిఎసిఎస్ ఛైర్మన్లు పిల్ల అప్పలనాయుడు, కె.విమలరాణి, చనమలు మహేశ్వరరావు, ఎంపిడిఒ రవికుమార్, డిప్యూటీ తహశీల్దార్ నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాలకు లైసెన్స్ లేకుంటే చర్యలు

ప్రజాశక్తి- కొత్తవలస

లైసెన్స్ లేకుండా బాణసంచా విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని విజయనగరం ఆర్‌డిఒ కీర్తి హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని చింతలపాలెం గ్రామ రెవెన్యూ పరిధిలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలను పరిశీలించారు. అనుమతులు లేకుండా టపాసులు తయారు చేసినా, అమ్మినా చట్ట రీత్యా నేరమని తెలిపారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ రహదారి 516బి రహదారి నిర్మాణంలో నష్టపోతున్న రైతుల వివరాలతో త్వరితగతిన నివేదిక పంపాలని తహశీల్దార్ అప్పలరాజును ఆదేశించారు.

మెంటాడ : బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరిగా ఉండాలని ఆంద్ర ఎస్ఐ కె.సీతారాం తెలిపారు. బాణసంచా విక్రయాలపై పోలీసులు కఠినంగా నిఘా పెడుతున్నట్లు చెప్పారు. లైసెన్స్ లేకుండా పటాసులు అమ్మే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మెరకముడిదాం : అనుమతులు లేకుండా ఎవరైనా బాణసంచా అమ్మకూడదని బుదరాయవలస ఎస్ఐ జె.లోకేష్‌కుమార్ తెలిపారు. అనుమానం వచ్చిన షాపుల్లో తనిఖీ చేస్తామని చెప్పారు. ఎక్కడైనా ప్రమాదకర సంఘటనలు జరిగితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విజయనగరం టౌన్ : నగరంలో బాణాసంచా చిల్లర వ్యాపారాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. చిన్న చిన్న బడ్డీలు, తోపుడుబండ్లపై బాణాసంచా అమ్మకాలను చేపట్టకుండా నియంత్రించాలని ప్రణాళిక, పారిశుధ్య సిబ్బందికి ఆదేశించారు. శుక్రవారం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు. కెఎల్ పురం ప్రాంతంలో అనుమతులు పొందిన పరిమిత దుకాణదారులు మాత్రమే బాణాసంచా విక్రయాలు చేపడతారని చెప్పారు. సమావేశంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి , అసిస్టెంట్ సిటీ ప్లానర్లు హరిబాబు, ఐ వి.రమణమూర్తి పాల్గొన్నారు.

జిందాల్ భూములు నిర్వాసితులకు ఇవ్వాల్సిందే

ప్రజాశక్తి-శృంగవరపుకోట

జిందాల్ పరిశ్రమ కోసం సేకరించిన భూములను తిరిగి నిర్వాసితులకు ఇవ్వాల్సిందేనని సిపిఎం నాయకులు చల్లా జగన్ డిమాండ్‌చేశారు. శుక్రవారం మండలంలోని బొడ్డవరలో నిర్వాసితులు చేపడుతున్న నిరసన 119వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడలో సెజ్ కోసం 20 ఏళ్ల కిందట తీసుకున్న భూమి పరిశ్రమలు పెట్టకపోవడంతో ప్రభుత్వమే తిరిగి రైతులకు ఇచ్చిందని గుర్తుచేశారు. జిందాల్ యాజమాన్యం 18 ఏళ్లు అయినా కంపెనీ ఏర్పాటు చేయకపోవడంతో కాకినాడ మాదిరిగానే నిర్వాసితులకు భూమి అప్పగించాలని డిమాండ్‌చేశారు.

చేయి చేయి కలిపారు.. గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నారు

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని కొమిరి గ్రామంలో యువత చేయి, చేయి కలిపి గ్రామాన్ని అభివద్ధి పథంలో నడిపించేందుకు నడుంబిగించారు. ఎన్నో ఏళ్లుగా గ్రామ పంచాయతీ అభివృద్ధిని ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో వారంతా సమావేశమై, ఓ నిర్ణయానికి వచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం యువత సొంత నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న పెద్ద చెట్లను జెసిబి ద్వారా తొలగించారు. పెద్ద కాలువ వరకు రోడ్డును శుభ్రం చేశారు. శ్రమదానంతో పిచ్చి మొక్కలను తొలగించి, ఇరువైపులా మట్టి పోసి రోడ్డు చదును చేశారు. గ్రామంలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఉద్యోగాలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు కోచింగ్ సెంటర్ కూడా ఏర్పాటు చేస్తామని యువత చెప్పారు.

సోంపురంలో పొలంబడి

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సోంపురం గ్రామంలో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు మిత్ర, శత్రు పురుగులపై మండల వ్యవసాయాధికారి స్వాతికుమారి అవగాహన కల్పించారు. పొలంబడి బ్యాగులు పంపిణీ చేసి, ఐపిఎం కిట్ల ఉపయోగాలు వివరించారు. కార్యక్రమంలో ఎఇఒ, విఎఎ తేజ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రుణాల చెల్లింపులపై దృష్టి పెట్టాలి
వ్యవసాయ, అనుబంధ విద్యార్థులకు అగ్రి క్లినిక్, అగ్రి బిజినెస్ పథకం : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

బ్యాంకుల నుండి రుణాలు అందజేస్తూనే మరో వైపు ఇచ్చిన రుణాలను రికవరీ చేయించడం కూడా అధికారుల ప్రధాన కర్తవ్యమని కలెక్టర్ ఎస్. రాం సుందర్ రెడ్డి తెలిపారు. రుణాల రికవరీ సక్రమంగా ఉన్నపుడే బ్యాంకుల పై రుణాల కోసం వత్తిడి తీసుకురాగలమని అన్నారు. రుణాలు తిరిగి చెల్లిస్తేనే మరల రుణాలను పొందగలమని లబ్ధిదారులకు అవగాహన కలిగించాలని అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. సమావేశంలో పిఎంఇజిపి, పిఎం విశ్వకర్మ , కౌలు రైతులకు రుణాలు , ముద్ర రుణాలు , స్టాండప్ ఇండియా , నాబార్డ్ రుణాలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం పథకాల కింద రుణాలను అందజేయడానికి బ్యాంకు లు ఆసక్తి చూపాలని అన్నారు. మండల స్థాయి లో నిర్వహిస్తున్న బ్యాంకర్ల సమావేశానికి బ్రాంచ్ మేనేజర్లు తప్పని సరిగా హాజరు కావాలని, ఆ సమావేశం లో తీసుకున్న నిర్ణయాలకు జిల్లా స్థాయి సమావేశంలో సమాధానాలు దొరుకుతాయని తెలిపారు. నాబార్డ్ ద్వారా అమలవుతున్న అగ్రి క్లినిక్, అగ్రి బిజినెస్ సెంటర్ పథకం ద్వారా వ్యవసాయ బోధన పూర్తిచేసిన యువతకు అగ్రి ప్రెన్యూర్లుగా మారే అవకాశాలు కల్పిస్తూ, రైతులకు ప్రొఫెషనల్ సలహా సేవలను అందించాలని అన్నారు. ఈ పథకంపై యువతకు అవగాహన కలిగించాలని కలెక్టర్ తెలిపారు. నాబార్డ్ డిడిఎం నాగార్జున మాట్లాడుతూ అగ్రి క్లినిక్, అగ్రి బిజినెస్ సెంటర్ పథకం కింద శిక్షణ సదుపాయం ఉందని, ఇందులో ఎంపికైన అభ్యర్థులకు 45 రోజుల ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ అందజేస్తామని తెలిపారు. వ్యక్తిగత లబ్ధిదారులకు గరిష్ఠంగా రూ.20లక్షల వరకు రుణం గుంపుగా (5 మంది వరకు) అయితే రూ.100లక్షల వరకు రుణం అందుబాటులో ఉంటుందని తెలిపారు. సమావేశంలో ఎల్‌డిఎం మూర్తి పాల్గొన్నారు. సమావేశం అనంతరం మెప్మా ద్వారా ముద్రించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు.

జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు సత్యనారాయణ ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నవంబర్ 15 నుండి హైదారాబాద్‌లో జరుగబోయే పారా జాతీయ స్థాయి స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్ పోటీలకు జిల్లాకు చెందిన పారా స్విమ్మర్ జాగరాన సత్యనారాయణ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె. దయానంద్ మాట్లాడుతూ ఇటీవల ఏలూరులో జరిగిన 7వ రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో సత్యనారాయణతో బాటు ప్రియాంకదాస్, కెల్ల మౌనికలు జిల్లా నుండి పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో మెడల్స్ గెలుచుకున్నారని తెలిపారు. సత్యనారాయణ సీనియర్ విభాగానికి సంబంధించి (ఎస్ 8) 50 మీటర్లు ఫ్రీ స్టైల్, 50 మీటర్లు బెస్ట్ స్ట్రోక్ పోటీల్లో జాతీయ కమిటీ నిబంధనల మేరకు కనీస అర్హత సాధించడంతో జాతీయ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. జాతీయ స్థాయి పోటీలోనూ సత్తా చాటి జిల్లాకు పేరు, ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. సత్యనారాయణకు పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు గోనుగుంట్ల కోటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి వి. రామస్వామి అభినందనలు తెలిపారు.

కార్మికులకు మోడీ ద్రోహం

ప్రజాశక్తి-బొబ్బిలి

కేంద్రంలో మోడీ ప్రభుత్వం 20 కోట్ల మంది కార్మికులకు ద్రోహం చేస్తుందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.శంకరరావు, ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు వి. శేషగిరిరావు అన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శుక్రవారం వారు మాట్లాడుతూ ఇపిఎఫ్ నిధులు రూ.25 లక్షల కోట్లు షేర్ మార్కెట్లో పెట్టేందుకు నిర్ణయించడం అన్యాయమన్నారు. ఇపిఎఫ్ కార్మికుల జీవితాలను నాశనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఇపిఎఫ్ పెన్షన్ నెలకు రూ.9 వేలు ఇవ్వాలని, షేర్ మార్కెట్లో కార్మికుల సొమ్ము పెట్టవద్దని కోరుతూ నవంబర్ 11న బొబ్బిలి తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామన్నారు. డిసెంబర్ 8, 9న చలో ఢిల్లీ నిర్వహిస్తామన్నారు. వీటిని జయప్రదం చేయాలని కోరారు.

కార్మికుల కుదింపు తగదు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

జ్యూట్ యాజమాన్యం ముడి సరుకు (నార) కొరత పేరిట కార్మికుల కుదింపు తగదని జ్యూట్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కిల్లంపల్లి రామారావు అన్నారు. శుక్రవారం స్థానిక జ్యూట్‌మిల్ గేటు వద్ద కార్మికులనుద్దేశించి ఆయన మాట్లాడారు. 2016 నుంచి ఇంత వరకు రిటైర్డ్ కార్మికులకు గ్రాడ్యూటీ బకాయిలు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. పిఎఫ్ బకాయిలు చెల్లించకపోవడంతో పింఛను పొందలేక పోతున్నారని చెప్పారు. ఇఎస్ఐ బకాయిలు కూడా చెల్లించలేదన్నారు. కార్మికుల సొమ్ము జ్యూట్ యాజమాన్యం దగ్గర ఉంచుకొని ముడి సరుకు కొరత పేరిట కార్మికుల కుదింపు చేసి వారికి ఉపాధి లేకుండా చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న యాజమాన్యంపై అధికార యంత్రాంగం చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం చేయడం తగదన్నారు.

సబ్‌జైలు, వన్‌స్టాప్ సెంటర్ తనిఖీ

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

విజయనగరం సబ్ జైల్, వన్ స్టాప్ సెంటర్, జువైనల్ జస్టిస్ బోర్డ్ ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణ ప్రసాద్ శుక్రవారం తనిఖీ చేశారు. కారాగారంలో ఉన్న ఖైదీలకు న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. వీరికి పలు చట్టాలపై అవగాహన కల్పించారు. .ఖైదీల పట్ల సిబ్బంది గాని తోటి ఖైదీలు గాని ఎటువంటి వివక్షత చూపించరాదని సిబ్బందికి సూచించారు. సబ్ జైల్లో కొనసాగుతున్న జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్ లను తనిఖీ చేశారు. .జైల్ క్లినిక్లను సందర్శించే న్యాయవాదులు మరియు పారా లీగల్ వాలంటీర్లు నిర్వహిస్తున్న విధులను గురించి ఆరా తీశారు. అనంతరం ధర్మపురి లో ఉన్న జువైనల్ జస్టిస్ బోర్డ్ సందర్శించి అక్కడ ఉన్న ప్యానల్ న్యాయవాదులతో బాల నేరస్తుల పట్ల తీసుకుంటున్నటువంటి కేసులను వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం శక్తి వన్ స్టాప్ సెంటర్ ను సందర్శించారు.

రాజమన్నార్ ఆలయ ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి-విజయనగరం కోట

శ్రీమన్నార్ రాజ గోపాలస్వామి దేవాలయం ధర్మకర్తల మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం శుక్రవారం స్థానిక ఆలయంలో జరిగింది. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతూ ఆలయ పాలకమండలి సభ్యులు దేవాలయ అభివృద్ధికి కషి చేయాలన్నారు. ధర్మకర్త మండలి ఛైర్మన్‌గా మామిడి దేవేంద్రనాథ్, సభ్యులుగా ఇమంది అమ్మాజీ, కంటుభుక్త రాంబాబు, కె.శంకర్రావు, ఆలవెల్లి వెంకటరమణ, దాసరి సత్యవతి, పేరి సత్య నాగమణి, ఎం. జగదాంబ నియమితులయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర తూర్పు కాపు ఛైర్మన్ పాలవలస యశస్విని, జిల్లా బిజెపి అధ్యక్షులు రాజేష్ వర్మ, కనకదుర్గమ్మ ఆలయ కమిటీసభ్యులు జివి నాగేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు గంటా రవి, మండల పార్టీ కార్యదర్శి పాశి అప్పలనాయుడు, అవనాపు విజయ్, డాక్టర్ సతీష్, ఆలయ ఇఒ వి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

పిఎం స్వనిధి రుణాలు మంజూరు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పిఎం స్వనిధి రుణాలు హెచ్చు స్థాయిలో మంజూరయ్యేలా కృషి చేయాలని కమ్యూనిటీ ఆర్గనైజర్లు, రిసోర్స్ పర్సన్‌లకు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య సూచించారు. శుక్రవారం కార్యాలయంలో లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో పిఎం స్వనిధి అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గత ఏడాది పిఎం స్వనిధి అమలులో రాష్ట్రంలో విజయనగరం నగరపాలక సంస్థ అవార్డును సాధించారు. సిఎం స్వనిధి 2.0 విధానంలో ఈసారి రుణాలను పెంచారన్నారు. 15,25,50 వేల వరకు రుణ మంజూరు మొత్తాలను పెంచినట్లు తెలిపారు. సమావేశంలో మెప్మా పీడీ చిట్టి రాజు, లీడ్ బ్యాంక్ మేనేజర్ మూర్తి, టిపిఆర్ఒ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

చిట్టిబాబుకు ఘన సన్మానం

ప్రజాశక్తి -కంటోన్మెంట్

ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో దోహా లో నవంబర్ మొదటి వారంలో జరుగనున్న అంతర్జాతీయ సదస్సులో పాల్గొనేందుకు దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.చిట్టిబాబుకు అవకాశం లభించటం ముదావహమని తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షులు సముద్రాల గురు ప్రసాద్, జెవివి నాయకులు డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజి పేర్కొన్నారు. శుక్రవారం తెలుగు భాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గురజాడ స్వగృహంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో పాల్గొని మాట్లాడారు. బాలలు, మహిళలు ,దళితుల హక్కుల కోసం అనునిత్యం పోరాడే చిట్టిబాబు ఇంతింతై వటుడింతై ఎదిగారని అభివర్ణించారు. చిట్టి బాబు మాట్లాడుతూ తనకు అరుదైన అవకాశం లభించినందుకు గర్వపడుతున్నానని తెలిపారు. సభలో వాకర్స్ క్లబ్ డిప్యూటీ గవర్నర్ ముళ్ళపూడి సుభద్రాదేవి, మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాల ప్రాచార్యులు డాక్టర్ జనార్దన్ నాయుడు ,రచయిత డాక్టర్ జక్కు రామకష్ణ, సిపిఐ జిల్లా కార్యదర్శి ఓమ్మి రమణ, గురజాడ ఇందిర, వెంకటేశ్వర ప్రసాద్ దంపతులు, ప్రముఖ న్యాయవాది దాసరి పద్మ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ బెంచ్ సభ్యులు సురగాల చిట్టిబాబు, డిబిఎస్‌యు నాయకులు పాల్గొన్నారు.

చిల్డ్రన్‌హోమ్స్‌కు ధ్రువపత్రాలు అందజేత

ప్రజాశక్తి- కంటోన్మెంట్

బాలల సరంక్షణా కేంద్రాలకు జిల్లా కలెక్టర్ రాంసుందర్ రెడ్డి శుక్రవారం ధ్రువప్రతాలను పంపిణీ చేశారు. జిల్లాలోని 3 బాల సదనాలకు, ఒక చిల్డ్రన్ హోమ్, ఒక శిశుగృహ హోమ్, 4 చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూట్స్ (ఎన్‌జిఒ హోమ్)లకు సర్టిఫికెట్‌లు పంపిణీ చేశారు. జిల్లాలోని శిశు సంరక్షణ సంస్థలపై పర్యవేక్షణను మరింత బలోపేతం చేయడానికి, జిల్లా స్థాయి తనిఖీ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కమిటీ ప్రతి మూడు నెలల కోసారి జిల్లాలోని అన్ని శిశు సంరక్షణ సంస్థలను తనిఖీ చేసి, ఫార్మ్-46 లో తమ నివేదికలను జిల్లా కలెక్టర్ వారికి సమర్పిస్తుందన్నారు. వార్షిక నివేదికను రాష్ట్ర స్థాయి మహిళా శిశు సంక్షేమ శాఖకు సిఫార్సు చేస్తామన్నారు. మొత్తం 32 సంస్థలకు ఫైనల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్స్ ను, మహిళాభివృద్ధి శిశుసంక్షేమశాఖ డైరెక్టర్ మంజూరు చేశారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి. విమలారాణి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్. హిమబిందు, జిల్లా బాలల సంరక్షణ అధికారి బి.హెచ్ లక్ష్మి, ప్రొటెక్షన్ ఆఫీసర్ వై.నాగరాజు, శిశుగృహ మేనేజర్ త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎం.రావివలసలో స్వచ్ఛాంధ్ర

ప్రజాశక్తి- మెరకముడిదాం

మండలంలోని ఎం.రావివలస గ్రామంలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ జి.భాస్కరరావు తెలిపారు. గ్రామంలో చెట్లు నాటడంతోపాటు స్వచ్ఛమైన గాలి.. నినాదంపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. అనంతరం ర్యాలీ, ప్రతిజ్ఞ, మానవహారం నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేరాలు ఘోరాలు

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-కొత్తవలస

మండలంలోని తుమ్మికాపల్లి గ్రామానికి చెందిన బొబ్బరి సోమినాయుడు (51) పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మద్యానికి బానిసై మనస్థాపానికి గురై గురువారం పురుగుల మందు తాగేశాడు. వెంటనే అతని భార్య 108 వాహనంలో ఎస్ కోట ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. అక్కడి నుండి మెరుగైన చికిత్స నిమిత్తం విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. సిఐ షణ్ముఖరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగి వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

నగరంలోని విటి అగ్రహారానికి చెందిన మహంతి అప్పలనర్సయ్య (76) ఈనెల 14న తన ఇంటివద్ద పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. వెంటనే కుటుంబ సభ్యులు జిల్లా సర్వజన ఆస్పత్రిలో చేర్పించారు.చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. అతని కుమారుడు వెంకరటమణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కొత్తవలస

మండలంలోని చిన్న రావు పల్లి గ్రామం శివార్లో గజ్జన్న గారు కల్లాల సమీపంలో గల చెరువులో గుర్తుతెలియని పురుషుని మృతదేహం శుక్రవారం లభ్యమైంది. అతడి వయసు 35 నుంచి 45ఏళ్ల మధ్య ఉంటుంది. చామన చాయ ఉండి ఎత్తు 5'1/2 అడుగులు, నలుపు రంగు ఆఫెన్స్ షర్టు వేసుకొని ఉన్నాడు. విఆర్ఒ సూర్యకళ ఇచ్చిన ఫిర్యాదుతో కొత్తవలస సిఐ షణ్ముఖరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఎవరైనా ఆ మృతదేహాన్ని గుర్తుపడితే పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

ప్రజాశక్తి- కంటోన్మెంట్

నగరంలోని సెయింట్ మేరీస్ ప్రాంతంలో నివాసం ఉంటున్న గుప్తేశ్వరరావు అదృశ్యమైనట్లు విజయనగరం వన్ టౌన్ సిఐ ఆర్.వి.ఆర్.కె చౌదరి శుక్రవారం తెలిపారు. కృష్ణ థియేటర్‌లో వాచ్ మెన్ గా పనిచేస్తున్న గుప్తేశ్వరరావు ఈనెల 5న రాత్రి విధులకు వెళ్ళొస్తానని చెప్పి ఇంటికి రాలేదని పేర్కొన్నారు. గుప్తేశ్వర రావు భార్య లక్ష్మి శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గంజాయి కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

ప్రజాశక్తి- కంటోన్మెంట్

నగరంలోని 1వ పట్టణ పోలీసు స్టేషన్‌లో 2022 సంవత్సరంలో నమోదైన గంజాయి కేసులో అస్సాం రాష్ట్రానికి చెందిన నిందితుడు ఆకాష్ ఖుడా (22)కు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ విజయనగరం ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఎం.మీనాదేవి శుక్రవారం వెల్లడించినట్టు ఎస్‌పి ఎ.ఆర్.దామోదర్, తెలిపారు. రైల్వే స్టేషన్ సమీపంలో 2022 సెప్టెంబర్ 19న ఒక లాడ్జిలో ముగ్గురు వ్యక్తులు మూడు బ్యాగులతో అనుమానాస్పదంగా ఉన్నట్లుగా విజయనగరం 1వ పట్టణ పోలీసులకు వచ్చిన సమాచారంతో పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకొని వారి నుండి 4.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై 1వ పట్టణ పోలీసు స్టేషన్ ఎస్ఐ బి.రామగణేష్ కేసు నమోదు చేయగా, అప్పటి 1వ పట్టణ పోలీసు స్టేషన్ సిఐ బి. వెంకటరావు దర్యాప్తు చేపట్టారు. విచారణలో నేరం రుజువు కావడంతో నిందితుడికి న్యాయమూర్తి జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. పోలీసుల తరుపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.సత్యం వాదనలు వినిపించారు.